క్లుప్తంగా

వీధిదీపాల ఏర్పాటు



భూత్పూర్: పట్టణంలోని జాతీయ రహదారిపై బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న ఇంటర్నల్ రహదారిపై శనివారం మున్సిపల్ అధికారులు వీధిదీపాలు ఏర్పాటు చేశారు. శనివారం సాక్షిలో ప్రచురితమైన 'అంధకారంలో ఇంటర్నల్ రహదారులు' శీర్షికపై మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్ స్పందించారు. మున్సిపాలిటీలోని ఇంటర్నల్ రహదారిలో వీధి దీపాలు ఏర్పాటు చేయించారు.

ముదిరాజ్ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడిగా బాబన్న

జడ్చర్ల టౌన్: తెలంగాణ ముదిరాజ్ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడిగా ఎడ్ల బాబన్న ఎన్నికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో శనివారం రాష్ట్ర అధ్యక్షుడు శివ ఆయనకు నియామక పత్రం అందజేశారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడికి బాబన్న కృతజ్ఞతలు తెలిపారు.

వాహనాల తనిఖీ



చిన్నచింతకుంట: మండలంలోని లాల్‌కోట చౌరస్తాలో శనివారం సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. రాయచూర్–హైదరాబాద్ ప్రధాన రహదారిపై రాకపోకలు సాగిస్తున్న వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువపత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐలు ఆర్.శేఖర్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



జడ్చర్ల టౌన్: మండలంలోని దేవునిగుట్టతండా శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో చండీహోమం నిర్వహించారు. మహాలయ అమావాస్యను పురస్కరించుకుని ఆచార్య కృష్ణస్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన అనంతరం హోమం చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని విజయదశమి వరకు నిత్యం చండీహోమం నిర్వహిస్తామని, భక్తులు పాల్గొనాలని ఆచార్య కృష్ణస్వామి కోరారు.

పితృదేవతలకు తర్పణాలు..

మహాలయ అమావాస్య సందర్భంగా పలువురు పితృదేవతలకు తర్పణాలు వదిలారు. కొందరు ఇళ్లలో పెద్దల ఫొటోలు అలంకరించి నైవేద్యాలు సమర్పించగా, మరికొందరు దుందుభి నదీతీరాన పిండ ప్రదానం చేసి పెద్దలకు తర్పణాలు వదిలారు.

స్త్రీశక్తి అవార్డ్స్ పోస్టర్ ఆవిష్కరణ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఈనెల 17న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 6వ ఎడిషన్ స్త్రీశక్తి అవార్డ్స్‌కు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కేంద్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలకు అవార్డులను ప్రదానం చేస్తున్న ఇండస్ట్రీ అధ్యక్షుడు బాలరాంబాబు, ప్రధాన కార్యదర్శి రవికుమార్‌ను మంత్రి అభినందించారు. అదేవిధంగా మహబూబ్‌నగర్ రూరల్ మండలం మాచన్‌పల్లికి చెందిన రవి రూపొందించిన పాటల సీడీని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. రవి స్వయ రచన, సంగీతంలో తల్లిలాంటి పల్లె ఒడిని కాపాడగా కదిలేరా, గల్లీగల్లీ రోడ్డు చూడు.. పల్లె పల్లె వెలుగు చూడు పేరిట పాటలు రూపొందించడంపై అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అశోక చక్రవర్తికి నివాళి

మహబూబ్‌నగర్ రూరల్: సామ్రాట్ అశోక ధర్మచక్రం ప్రవర్తన దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మహామాయ గౌతమబుద్ధ విహార్ ఆధ్వర్యంలో సామ్రాట్ అశోక చక్రవర్తి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బౌద్ధ ధర్మ దీక్ష చేపట్టిన రోజు సందర్భంగా సామ్రాట్ అశోక ధర్మచక్రం ప్రవర్తన దినోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బుద్ధ విహారం కోశాధికారి పట్నం చెన్నయ్య, భాగ్యమ్మ పాల్గొన్నారు.



జడ్చర్ల సాయినగర్ సకలదేవతల ఆలయంలో..



దేవరకద్ర మండలం నాగారంలో..

ఘనంగా బతుకమ్మ సంబరాలు

- వేడుకల్లో విదేశీ మహిళల సందడి



జిల్లా కేంద్రంలో బతుకమ్మ ఆడుతున్న విదేశీ మహిళలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని పద్మావతీకాలనీలో శనివారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆడిపాడారు. వేడుకల్లో విదేశీ మహిళలు పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన బైక్ రైడర్లు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను తెలుసుకునేందుకు ఫ్రాన్స్, అమెరికా, జర్మని, ఆస్ట్రేలియా, సింగపూర్, థాయిలాండ్ దేశాల నుంచి మహిళా బైక్ రైడర్లు రాష్ట్రానికి వచ్చినట్లు తెలిపారు. 9 రోజులపాటు బైక్‌ల మీద పలు జిల్లాల్లో పర్యటించి బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటారని చెప్పారు.

జడ్చర్ల టౌన్: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి, చైతన్యనగర్ బంగారు మైసమ్మ, సాయినగర్ సకలదేవతల ఆలయాలతోపాటు శ్రీనివాసనగర్, సరస్వతినగర్, హౌజింగ్‌బోర్డు కాలనీల్లో బతుకమ్మ సంబరాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మహిళలు ఎంగిలిపూల బతుకమ్మను తీర్చిదిద్ది ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు.

దేవరకద్ర: మండలంలోని నాగారంలో బతుకమ్మ వేడుకలను కనులపండువగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో అలంకరించిన బతుకమ్మలతో ఊరేగింపుగా ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకుని ఆడి పాడారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి



దేవరకద్రలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రవినాయక్

- ఒక ఇంట్లో ఉన్న ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండాలి
- కలెక్టర్ రవినాయక్

జడ్చర్ల టౌన్/దేవరకద్ర: అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. జడ్చర్ల మండలం కావేరమ్మపేట, తంగెళ్లపల్లి, నసురుల్లాబాద్ గ్రామాలతో పాటు దేవరకద్ర బాలికల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శనివారం పరిశీలించారు. కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్, ర్యాంపు తదితర సౌకర్యాలను తెలుసుకున్నారు. సంబంధిత పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటరు జాబితాలను తనిఖీ చేశారు. చనిపోయిన వారి పేర్లు, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి శాశ్వతంగా వలస వెళ్లిన వారి, డబుల్ ఓటర్ల పేర్ల తొలగింపుపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఒక ఇంట్లో ఉండే ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండాలని అధికారులకు సూచించారు. దేవరకద్ర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో అన్ని సౌకర్యాలను మెరుగు పరచాలని ఆదేశించారు. టాయిలెట్లను మరమ్మతు చేయించాలని, విద్యుత్, మంచినీరు వసతి కల్పించడంతో పాటు ర్యాంపుల నిర్మాణం చేపట్టాలని తెలిపారు. ఎన్నికల పోలింగ్ నాటికి కేంద్రాలను కనీస సౌకర్యాలతో సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా తహసీల్దార్ కార్యాలయాల్లో ఓటరు జాబితా తయారీపై సమీక్ష నిర్వహించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అదనపు కలెక్టర్ మోహన్‌రావు, నటరాజ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవీంద్రనాథ్, మండల ప్రత్యేకాధికారి రవీందర్, తహసీల్దార్లు శ్రీనివాస్, బ్రహ్మంగౌడ్, ఎంపీడీఓ శ్రీనివాసులు, డీటీలు రాజీవ్‌రెడ్డి, శివరాజు, రహమాన్, ఎంఈఓ మంజులాదేవి, సీత్యానాయక్ పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్‌పై అవగాహన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని 12వ వార్డులో శనివారం రెడ్యూస్–రీయూజ్–రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్)పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హనుమాన్‌పుర, జములమ్మనగర్‌లో పలువురు పిల్లల ఆటవస్తువులు, నోట్‌బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఆర్‌ఆర్ సూపర్‌వైజర్ ఉమ, ఆర్పీ షాజహాన్ పాల్గొన్నారు.

చీరల పట్టివేత

జడ్చర్ల: పట్టణంలోని జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద శనివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. నాగర్‌కర్నూల్ వైపు కారులో చీరలు తరలిస్తుండగా, పట్టుకున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. కాగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి పూజకు సంబంధించి చీరలను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నట్లు నిర్వాహకులు పోలీసులకు వివరించారు. కొనుగోలుకు సంబంధించిన బిల్లులను సైతం చూపించారు. అయితే ఎన్నికల నిబంధనల మేరకు తాము చీరలను స్వాధీనం చేసు కుని సీజ్ చేశామని, జిల్లా ఎన్నికల అధికారికి చీరలను స్వాధీనపరుస్తామని సీఐ తెలిపారు.

ప్రభుత్వ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి



భూత్పూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరుతోందని మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి అన్నారు. మద్దిగట్లలో ఎంపీపీ, శేరిపల్లి(హెచ్)లో మున్సిపల్ చైర్మన్ శనివారం గ్రామస్తులతో సమావేశమై మాట్లాడారు. అన్ని వర్గాల అభ్యున్నతికి దేశంలో ఎక్కడాలేని పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్‌తోనే ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట మునిగినట్లే..

- ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నవాబుపేట: కాంగ్రెస్ పార్టీకే గ్యారెంటీ లేదు.. ఆ పార్టీ ప్రకటించిన పథకాలను నమ్మితే నట్టేట మునిగినట్లేనని ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కేవలం అధికారంలోకి రావాలనే ఆలోచనతో ప్రకటనలు చేస్తుంది తప్ప.. వాటిని అమలు చేయాలన్న ఆలోచన లేదన్నారు. మొన్నటికి మొన్న కర్ణాటకలో ఇచ్చిన హామీలను గాలికొదిలేయడంతో జనాగ్రహం మొదలైందన్నారు. కాంగ్రెస్‌లో కేసీఆర్ లాంటి నికార్సైన నాయకుడు లేడని.. పార్టీ నిండా సీఎం అభ్యర్థులే ఉన్నారని, వారంతా నిత్యం తగాదాలతో ఎవరు ఎప్పుడు పార్టీని విడుతారో తెలియని పరిస్థితి ఉందన్నారు. బీసీల గురించి మాట్లాడే నాయకులు.. తాజాగా బీసీ నేత పార్టీని వీడటంపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. పేదల సంక్షేమానికి సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. మండల అధ్యక్షుడు నర్సింహులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య, రైతుబంధు సమితి చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ముడా డైరెక్టర్ చెన్నయ్య, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీలు ఇందిరాదేవి, స్వరూప, మండల యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రతాప్, లక్ష్మయ్య, సర్పంచ్‌లు గోపాల్, యాదయ్య, వెంకటేష్, సత్యం, రఘు, నర్సింహులు ఉన్నారు.

జడ్చర్ల టౌన్: పట్టణంలోని చంద్రగార్డెన్‌లో బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరగా, ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు.

నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు

- వివిధ రూపాల్లో దర్శనమివ్వనున్న జగన్మాత



జిల్లా కేంద్రంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన రేణుక ఎల్లమ్మ ఆలయం

స్టేషన్ మహబూబ్‌నగర్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆదివారం నుంచి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడి వాసవీ కన్యకాపరమేశ్వరి, సింహగిరి లక్ష్మీనరసింహస్వామి, గణేష్‌నగర్ అభయాంజనేయస్వామి, శ్రీనివాసకాలనీ పంచముఖ ఆంజనేయస్వామి, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రేణుకా ఎల్లమ్మ, పాతపవర్ హౌజ్ సమీపంలోని అంబా భవాని, వీరన్నపేట చౌడేశ్వరిదేవి, పద్మావతి కాలనీ సంతోషిమాత ఆలయాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఉమాదేవి స్వర్ణకవచాలకృత, 16న అన్నపూర్ణాదేవి, 17న సంతాన లక్ష్మి, 18న గాయత్రీదేవి, 19న మహాలక్ష్మీదేవి, 20న సరస్వతీమాత, 21న వనదుర్గాదేవి, 22న మహాకాళీదేవి, 23న ఉదయం కనకదుర్గాదేవి (ఆరాధన), సాయంత్రం లలితాదేవి (అలంకరణ), 24న వాసవీమాత రూపంలో అమ్మవారిని అలంకరించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గుండ వెంకటేశ్, మిర్యాల వేణుగోపాల్ తెలిపారు. స్థానిక వాసవీ ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి రోజు సంఘం కోశాధికారి తల్లం నాగరాజు స్వగృహం నుంచి అమ్మవారి స్వర్ణ ఆభరణాలు, పట్టువస్త్రాలతో ఆలయం వరకు ఊరేగింపు ఉంటుందన్నారు. చివరి రోజు అమ్మవారి వాహన సేవలతో ఎంతో వైభవంగా శోభాయాత్ర ఉంటుందని, భక్తులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఎదిరె ప్రమోద్‌కుమార్, కొండ చక్రధర్‌గుప్తా, చంద్రశేఖర్ ఉన్నారు.

దేవరకద్ర: పట్టణంలోని పోచమ్మ, వాసవీమాత ఆలయాలతోపాటు లక్ష్మీపల్లి కనకదుర్గాదేవి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్యులు

నవాబుపేట: మండలంలోని మైసమ్మ ఆలయంలో నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని ఆహ్వానించినట్లు ఆలయ చైర్మన్ కృష్ణయ్య, అధికారి మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో చండీహోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

శౌర్యజాగరణ రథయాత్రతో దేశ, దైవభక్తి పెంపు



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

స్టేషన్ మహబూబ్‌నగర్: యువతలో దేశ, దైవభక్తి పెంపొందించేందుకు వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శౌర్య జాగరణ రథయాత్ర చేపట్టినట్లు బజరంగ్‌దళ్ క్షేత్ర ప్రముఖ్ కుమారస్వామి చెప్పారు. జిల్లా కేంద్రంలోని బోయపల్లిగేట్ హనుమాన్ ఆలయంలో శనివారం శౌర్య జాగరణ రథయాత్ర ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15రోజులుగా అన్ని మండలాల్లో శౌర్య జాగరణ రథయాత్ర నిర్వహించినట్లు తెలిపారు. వీహెచ్‌పీ ప్రాంత ఉపాధ్యక్షుడు జగదీశ్వర్, బజరంగ్‌దళ్ ప్రాంత సంయోజక్ శివరాం మాట్లాడుతూ గతంలో అయోధ్య రామ మందిరం నిర్మాణం కోసం జరిగిన పోరాటంలో లక్షలామంది యువకులు ప్రాణాలర్పిస్తే, ప్రస్తుతం ఎలాంటి ఆటంకం లేకుండా మందిరం నిర్మాణం పూర్తి చేసుకుంటున్నట్లు తెలిపారు. బలిదానం చేసిన కార్యకర్తలను స్మరించుకోవడం మన ధర్మమని అన్నారు. గ్రామాల్లో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేయాలన్నారు. సమావేశంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, కార్యదక్షుడు బుచ్చారెడ్డి, ఉపాధ్యక్షుడు జగ్పాల్‌రెడ్డి, కార్యదర్శి నలిగేశి లక్ష్మీనారాయణ, విభాగ్ కార్యదర్శి నరేందర్, జనార్దన్, గురురాజు, విఘ్నేష్, శ్రీకాంత్, ఛత్రపతి, ఆంజనేయులు, కుమార్, భరత్, లావణ్య పాల్గొన్నారు.

వైద్యవిధాన పరిషత్‌పై వివక్ష



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

జడ్చర్ల టౌన్: వైద్య విధాన పరిషత్‌పై ప్రభుత్వం వివక్ష చూపడం వల్ల కార్మికులు అవస్థలు పడుతున్నారని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం పారిశుద్ధ్య కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్యారోగ్యశాఖలోని పలు విభాగాలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నట్లు తెలిపారు. డీఎంఈ పరిధిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్ కార్మికుల వేతనాల బడ్జెట్ విడుదలై మూడు నెలలు గడుస్తుందని, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న వైద్యవిధాన పరిషత్‌లో 7 నెలలుగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వేతన బడ్జెట్ విడుదల చేయలేదన్నారు. అనేక పర్యాయాలు వివిధ రూపాల్లో ఆందోళనలు, విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవడంలేదని తెలిపారు. కార్మికులకు వేతనాల బడ్జెట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మణెమ్మ, శివలీల, అలివేల, చిలకమ్మ, సుక్కమ్మ, నర్సింహ ఉన్నారు.

అందరి సంక్షేమానికి ఆరు గ్యారెంటీలు



కోడూరులో ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: అందరి సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆరు గ్యారెంటీ పథకాలను పొందుపర్చిందని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈట రవీందర్ అన్నారు. మండలంలోని కోడూర్‌లో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. బీఆర్‌ఎస్ పాలనలో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, గానుగ కుర్మయ్య, నాగన్న, వెంకటేష్, వినోద్, చందు పాల్గొన్నారు.

ఇసుక తరలింపును అడ్డుకున్న రైతులు



వాగులో ఇసుక తరలింపును అడ్డుకుంటున్న రైతులు

అడ్డాకుల: మండలంలోని కన్మనూర్ గ్రామశివారులో పెద్దవాగు నుంచి ఇసుక తరలింపును శనివారం కౌకుంట్ల మండలం రేకులంపల్లి గ్రామ రైతులు అడ్డుకున్నారు. ఇటీవల ప్రభుత్వ అవసరాలకు వాగులో ఇసుక తవ్వకాలు చేపట్టారు. వాగులో ఇసుక తరలింపుతో వ్యవసాయ బోరుబావులు ఎండిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వాగులో శివారు హద్దులు చూయించకుండా తవ్వకాలు చేపడుతున్నారని ఆరోపించారు. సమాచారం అందుకున్న ఆర్‌ఐ సాహత్ ఇషాన్ అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. ప్రభుత్వ అవసరాలకే ఇసుక తరలింపు చేపట్టామని వివరించారు. ఉన్నతాధికారులు ఆదేశిస్తే ఇసుక తరలింపును నిలిపేస్తామని, అప్పటి వరకు ఇసుక తరలింపును అడ్డుకోవద్దని సూచించడంతో రైతులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

కొవ్వొత్తుల ప్రదర్శన



కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: అఖిలపక్షం ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టి గ్రూప్–2 అభ్యర్థి ప్రవళికకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవళికది ఆత్మహత్య కాదని.. ముమ్మాటికి ప్రభుత్వ హత్యే అని అన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యోగాలు రాక యువత ఆత్మబలిదానాలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వానికి రానున్న రోజుల్లో పతనం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధులు హర్షవర్ధన్‌రెడ్డి, జహీర్ అఖ్తర్, నాయకులు సిరాజ్ ఖాద్రీ, సాయిబాబా, లక్ష్మణ్ యాదవ్, అజ్మత్‌అలీ, అవేజ్, రాములు పాల్గొన్నారు.

నిరుద్యోగులను వమ్ము చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం

స్టేషన్ మహబూబ్‌నగర్: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగుల ఆశలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం వమ్ముచేసిందని మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లయినా తెలంగాణలో పూర్తిస్థాయిలో ఉద్యోగాలు రాలేదన్నారు. ఉద్యోగాలు లేవని, పరీక్షలు రాసినా ఫలితాలు రావడం లేదంటూ నిరుద్యోగ యువత ఆవేదన పడుతున్నట్లు తెలిపారు. ఉద్యోగాల నోటిఫికేషన్ల కోసం మంత్రులు, ప్రజాప్రతినిధులు సీఎం కేసీఆర్‌పై ఎందుకు ఒత్తిడి చేయడం లేదన్నారు. పెద్ద ఉద్యమకారుడిగా చెప్పుకునే ఇక్కడి మంత్రి విద్యార్థుల పక్షాన ఎందుకు గొంతు విప్పడం లేదని ప్రశ్నించారు. టీఎస్‌పీఎస్సీ పరీక్షలు నిర్వహించలేని ఈ అసమర్థ ప్రభుత్వాన్ని యువత ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గ్రూప్స్ పరీక్షలు నిర్వహించడంతో పాటు నిరుద్యోగులకు బాసటగా నిలుస్తామని అన్నారు. సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు సిరాజ్ ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, సాయిబాబా, సుభాష్‌ఖత్రి పాల్గొన్నారు.